క్లుప్తంగా

రోగులకు పండ్లు, రొట్టెల వితరణ

సీతంపేట: సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా స్థానిక ట్రాన్స్‌కో ఏఈ జి.నీలిమ కుమారుడు పుట్టిన రోజును కూడా పురస్కరించుకుని శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలోని రోగులు వంద మందికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ గీతాంజలి, జి.రామకృష్ణ, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరూ విధిగాఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఏబీ రోడ్డులో నిలిచిన లారీ

భామిని: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ఏబీ రోడ్డులో సింగిడి - పసుకుడి గ్రామాల మధ్య గోతుల్లో నీరు చేరడంతో లారీ కూరుకుపోయింది. దీంతో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

ఈ - పంట నమోదు చేసుకోవాలి



ఈ - పంటలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

పాలకొండ : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను ఈ - పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ - పంట నమోదు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. రైతులు రైతుభరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయ సహాయకుల ద్వారా తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని వెలగవాడ, పర శురాంపురం, కొండాపురం, పాలకొండ, వడమ, ఎన్‌కే రాజపురం ప్రాంతాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదును ఆమె పరిశీలించారు.

వీధి దీపాల పునరుద్ధరణ



లక్కగూడ ప్రధాన రహదారిలో విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో పాడైన విద్యుత్ వీధిదీపాల స్థానంలో శనివారం కొత్తవి ఏర్పాటు చేశారు. సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, కార్యదర్శి కిశోర్ ఆధ్వర్యంలో గ్రామంలోని గడ్డికాలనీ, శృంగవరపు కాలనీ, చింతలగూడ కాలనీతో పాటు మెయిన్ రోడ్డులో పాడైన విద్యుత్ వీధి దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. అలాగే గడ్డికాలనీలో పాడైన బోరును బాగు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. వీధి దీపాలు పాడవడంతో గత కొన్ని రోజులుగా గ్రామంలో అంధకారం నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై సర్పంచ్ వెంటనే స్పందించి పరిష్కరించారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి: డీఐఓ

పార్వతీపురంటౌన్: చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నారాయణ అన్నారు. మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో శనివారం పలువురు చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది టీకాలు వేశారు. వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన డీఐఓ ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. టీకా కార్డులో నమోదు చేసిన తేదీలను పరిశీలించారు. నిర్ణీత గడువు తేదీలోగా పిల్లలకు టీకాలు వేసేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

కోరం లేక ఎన్నిక వాయిదా

సీతానగరం: మండలంలోని అంటిపేట, కొత్తవలస ప్రాథమిక పాఠశాలలతో పాటు నిడగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలను కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంఈఓ తెలిపారు. అంటిపేటలో 1,2,4,5 తరగతులకు, కొత్తవలస 1,2,5 తరగతులకు, నిగడల్లులో 7వ తరగతికి సంబంధించి ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

పచ్చగడ్డిలో పోషకాలు మెండు..

- స్వయంగా పశుగ్రాసం సాగు మేలు
- పచ్చగడ్డితో అధిక పాల ఉత్పత్తి

పాలకొండ రూరల్:

పాల ఉత్పత్తి గణనీయంగా పెరగాలంటే అధిక పోషకాలున్న పశుగ్రాసం ఎంతో అవసరం. సహజంగా పశుగ్రాసం అంటే రైతులకు వెంటనే గుర్తొకొచ్చేది వరిగడ్డి, పచ్చగడ్డి. వరి గడ్డిలో పోషకాలు చాలా తక్కువగా ఉండడమే కాకుండా త్వరగా జీర్ణం కాదు. పచ్చగడ్డి మంచి పశుగ్రాసం. అధిక పోషకాలున్న పశుగ్రాసాల్లో మూడు రకాలున్నాయి. వీటిని ధాన్యపు జాతి, గడ్డి జాతి, కాయ జాతిగా విభజించారు. వీటిలో ధాన్యపు జాతి పశుగ్రాసాలు ఎక్కువ పోషకాలు కలిగి ఉంటాయి.

లూసర్న్ రకం..

ఈ పశుగ్రాసాన్ని ఏక వార్షిక, బహు వార్షిక విధాలుగా సాగు చేసుకోవచ్చు. మాంసకృత్తులు, కాల్షియం అధికంగా ఉండి పచ్చిమేతగా, ఎండు మేతగా కూడా ఉపయోగించుకోవచ్చు. అన్ని రకాల సారవంతమైన భూముల్లో సాగు చేసుకోవచ్చు. ఎకరాకు 6 కిలోల నుంచి 8 కిలోల విత్తనాలు వేయాల్సి ఉంటుంది. మొదటి పర్యాయం విత్తేటప్పుడు బ్యాక్టీరియా కల్చర్‌తో కలిపి విత్తడం మంచిది. అక్టోబర్ నుంచి నవంబర్ మధ్య దీన్ని నాటుకునేందుకు అనువైన సమయం. విత్తిన 70 రోజుల అనంతరం మొదటి కోతకు వస్తుంది. తర్వాత ప్రతి 25 రోజుల వ్యత్యాసంతో ఆరేడు కోతలు కోయవచ్చు. ఎకరాకి 25 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

హైబ్రిడ్ నేపియర్..

ఈ గడ్డి రకం ఎక్కువ పరకలతో ఎక్కువ ఆకులు కలిగి రుచికరంగా ఉంటుంది. నీటి పారుదల కలిగిన అన్ని భూముల్లో సాగు చేసుకోవచ్చు. ఏడాది పొడవునా పశుగ్రాసాన్ని సాగు చేసుకోచ్చు. ప్రస్తుత సీజన్‌లో నాటుకుంటే పశుగ్రాసాన్ని అందుబాటులోకి తెచ్చుకోవచ్చు. నాటిన 70, 75 రోజులకు మొదటి కోతకు వస్తుంది. ప్రతి 40 రోజులకు ఒకసారి కోత కోయవచ్చు. ఒకసారి నాటితే నాలుగేళ్ల వరకు ఉపయోగించుకోవచ్చు. ఏడాదికి ఎకరాకి 60 నుంచి 70 టన్నుల పశుగ్రాసం దిగుబడి వస్తుంది.

స్వీట్ సూడాన్..

ఇది జొన్న రకానికి చెందిన పశుగ్రాసం. ఎత్తుగా, ఏపుగా పెరిగి అధిక పశుగ్రాసాన్ని ఇస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో 80 శాతం పచ్చిమేత ఈ రకం పశుగ్రాసం తీరుస్తుంది. ఇది తక్కువ వర్షపాతం కలిగిన ప్రాంతాల్లో సాగు చేసుకోవచ్చు. ఈ రకాన్ని జనవరి నుంచి ఆగస్టు వరకు సాగు కోవచ్చు. మూడు నుంచి నాలుగు కోతలు వస్తుంది.



బహిరంగ ప్రాంతాల్లో మేత మేస్తున్న పాడిపశువులు



సాగులో పశుగ్రాసం

అధిక పాల ఉత్పత్తి..



వ్యవసాయ శాఖాధికారులు సూచించే పశుగ్రాసం పెట్టి పాడి పశువులను పోషిస్తే వాటికి బలవర్ధకమైన పశుగ్రాసం అందుతుంది. తద్వారా అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చు. పచ్చిమేతతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. అధిక పాల ఉత్పత్తికి అవకాశం ఉంటుంది. దీంతో పాడిరైతుల కుటుంబ ఆదాయం పెరుగుతుంది. ఈ తరహా పశుదాణా సేద్యానికి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది.

– ప్రభా మాణిక్యరావు, పశు సంవర్ధకశాఖ ఎ.డి, పాలకొండ

లైన్ సోయింగ్‌తో ప్రయోజనం

గుమ్మలక్ష్మీపురం: వరుస క్రమంలో వరి నాట్లు వేయడం వల్ల ఎంతో ప్రయోజనమని ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని టెంకసింగి గ్రామంలోని పది మంది రైతులు 12 ఎకరాల విస్తీర్ణంతో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరిపంటను శనివారం ఆమె పరిశీలించారు. వరుస క్రమంలో నాటుకోవడం వల్ల మొక్కలకు గాలి, వెలుతురు సమృద్ధిగా అందుతుందని, కలుపు నివారణ సులభమవుతుందని, పైరు ఏపుగా పెరిగి దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతాన్ని ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేసుకోవడం ద్వారా చీడపీడల నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. అలాగే పొలం గట్లపై చిక్కుడు, బంతి మొక్కలు వేసుకోడం వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ అన్నపూర్ణ, తదితరులు

బడిబయట పిల్లలను గుర్తించాలి: ఎంఈఓ

గరుగుబిల్లి: చదువు మధ్యలో ఆపివేసిన బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని ఎంఈఓ ఎన్.నాగభూషణరావు అన్నారు. స్థానిక ఎంఆర్‌సీలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పిస్తోందన్నారు. ఏ పాఠశాలలోనూ చేరకుండా ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.కొండలరావు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

మంచి అలవాట్లతోనే భవిష్యత్

- డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: మంచి అలవాట్లతో భవిష్యత్ బాగుంటుందని డీఎస్పీ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని తమ్మినాయుడు విద్యాసంస్థల ఆవరణలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, యువత నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటన అత్యంత బాధాకరమని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆడ పిల్లలు మరింత జాగ్రత్త ఉండడంతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డీఎస్పీ కృష్ణారావు



పొంగిపొర్లుతున్న సాగునీరు

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలోని ఒకటో బ్రాంచ్ కాలువలో కడకెల్ల, నడిమికెల్ల గ్రామాల సమీపంలో సాగునీరు పొంగిపొర్లుతోంది. కాలువ గట్ల పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్లకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున కాలువకు సరిపడా నీటిని మాత్రమే విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై జలవనరుల శాఖ అధికారులను వివరణ కోరగా కంబరవలస, నడుకూరు గ్రామాల వైపు వెళ్లే కాలువలో జంగిల్ క్లియరన్స్ పనులు చేపడుతుండడంతో నీటి ప్రవాహం పెరిగిందని.. ఆదివారానికి ప్రవాహం తగ్గి యథావిధిగా నీరు వస్తుందని తెలిపారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నడిమికెల్ల - కడకెల్ల గ్రామాల మధ్య ఒకటో బ్రాంచ్ కాలువ గట్లు దాటుకుంటూ వస్తున్న నాగావళి నీరు

బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు

పార్వతీపురంటౌన్: బాల్యవివాహాలు వద్దు.. చదువే ముద్దు అని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిరోధకం చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు లోపు పెళ్లి చేస్తే చట్ట రీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు నిర్వహించినా, వాటిని ప్రోత్సహించినా లక్ష రూపాయల జరీమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక, సామాజిక అనర్థాలను వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే ఆ గ్రామంలోని సచివాలయంలో లేదా చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్.ప్రసాదరావు కౌమార దశలో బాలలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ ఆర్.హరికృష్ణ, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి

గరుగుబిల్లి: విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో శనివారం 'యాంటీ ర్యాగింగ్'పై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉందన్నారు. విద్యార్థి స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, ర్యాగింగ్ వంటి అసాంఘిక కృత్యాలు నిర్వహించి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. సమయపాలన పాటించడంతో పాటు మహిళల పట్ల, చట్టాల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. సీనియర్ న్యాయవాది తిమిటి జోగారావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు నిబంధనలు అతిక్రమించి వ్యవహరించకూడదన్నారు. జీవిత లక్ష్యాలను సాధించేందుకు చదవడం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.హరిరామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

మండల సమావేశాలకూ రాలేరా?

- అధికారుల తీరుపై సభ్యుల అసహనం

కొమరాడ: కనీసం మూడు నెలలు ఒకసారి జరిగిన సమావేశానికి కూడ రాలేని స్థితిలో అధికారులు ఉన్నారని ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ డి.లక్ష్మి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి పలు శాఖల అధికారులు రాకపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి మాట్లాడుతూ.. గంగారేగువలస గ్రామంలో తాగునీటి సమస్య ఉందని రెండుళ్లుగా చెపుతున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆ శాఖ జేఈ నవీన్‌కుమార్‌పై మండిపడ్డారు. బినామీ పేర్లతో కాంట్రక్టులు చేసి గ్రామల్లోని తాగునీరు సమస్య సృష్టించి బిల్లులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించేకపోతే జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే తొడము సర్పంచ్ యేగిరెడ్డి సింహాచలం మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు గిరిశిఖర గ్రామల్లో రైతులకు అందుబాటులో ఉండటం లేదని, డీఏపీ కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెలుగు విభాగంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిని రాజకీయ కక్షలతో కూటమి నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కతోవ పడుతోందని, అయినా సూపర్‌వైజర్లు కనీసం పర్యవేక్షణ చేయడం లేదని ఆరోపించారు. గ్రామల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రోటోకాల్ లేకుండా కూటమి నాయకలు పెత్తనం చేస్తున్నారని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఎంఈఓ జామి నారాయణ స్వామి, ఏఓ పి.శంకరరావు, ఉపాధిహామీ పథకం ఏపీఓ బాలకృష్ణ, తదితరులు పాల్గున్నారు.



జేఈ నవీన్‌కుమార్‌పై మండిపడుతున్న జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి

మెరుగైన బోధన అందించాలి

- డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: ఉత్తమ ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలల్లో విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతులు, తదితర అంశాలపై ఆరా తీశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి బోధన అందించాలన్నారు. సమావేశంలో హెచ్ఎం బి.సంఘంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పాలకొండ రూరల్: చదువుపై ఆసక్తి ఉన్నవారు అవకాశాలను అందిపుచ్చుకోవాలని గుంటూరుకు చెందిన ఓపెన్ స్కూల్ నిర్వాహకుడు సుధాకర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో అక్షరాశ్యతా శాతం పెంపొందించేందుకు, వివిధ కారణాలతో అర్ధంతరంగా చదువులకు దూరమైన వారికి ఓపెన్ స్కూల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి నేతృత్వంలో నిర్వహించారు. పాలకొండ, సీతంపేట మండలాల్లో ఓపెన్ స్కూల్ పునఃప్రారంభానికి అవసరమైన చర్యలపై డిప్యూటీ డీఈఓతో ఆయన చర్చించారు. అనంతరం ఓపెన్ స్కూల్‌కు చెందిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమనీకుమార్, సీహెచ్ శ్రీనివాసరావు, ఏఎల్ఎస్ అప్పలనాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ కాంప్లెక్స్ సభ్యులు ఆర్.రాములు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఈఓ, తదితరులు

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి..

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక వైద్యులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడిన వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అని ఈ సందర్భంగా పలువురు ప్రశ్నించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం నిరసన ర్యాలీలు చేపట్టారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



పాలకొండ రూరల్: ఏరియా ఆస్పత్రి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది



గరుగుబిల్లి: గరుగుబిల్లి బస్టాండ్ ఆవరణలో వైద్య సిబ్బంది మానవహారం



గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న భద్రగిరి సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



సీతంపేట: ర్యాలీ చేస్తున్న ప్రాంతీయ ఆస్పత్రి వైద్య సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: కురుపాంలో నిరసన ర్యాలీ చేస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది



వీరఘట్టం: ఆందోళన చేస్తున్న వైద్యాధికారులు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది



భామిని: మండల కేంద్రంలో నినాదాలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది



కొమరాడ: మండల కేంద్రంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మక్కువ: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎం.పారమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు తెలియజేసిన ప్రతి సమస్యకు అధికారులు జవాబు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. త్వరలో సర్పంచుల ఖాతాలోకి నగదు జమ చేయనున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. మండలంలో గిరిజన ప్రాంతమైన దుగ్గేరు గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని మంత్రి తెలిపారు. అలాగే వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తిచేసి ఆయకట్టు శివారు గ్రామాలకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ సిహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, సీడీపీఓ అనంతకుమారి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.